


# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

మంగళవారం,
మార్చి 18, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-


## వైసీపీ సభ్యులు ఆరోపణలుచేసి పారిపోతున్నారు: నారా లోకేశ్



సభా సమావేశాల నుంచి నేడు వైసీపీ సభ్యుల వాకౌట్

బయట ఉన్న వైసీపీ సభ్యులను మార్షల్స్ సాయంతో లోపలికి తీసుకురావాలన్న లోకేశ్

చైర్మన్‌కు ఆ అధికారం ఉందని వెల్లడి

## కొత్తగా 37 మద్యం బ్రాండ్లు

రాష్ట్రంలో మద్యం సరఫరా చేసేందుకు కంపెనీల ఆసక్తి

ఊహించిన దానికన్నా ఎక్కువ స్పందన..

ఆసక్తి వ్యక్తీకరించిన 15 విదేశీ బ్రాండ్లు

15 దేశీయ లిక్కర్.. ఏడు బీర్ బ్రాండ్లు కూడా

మరో నెలలో అంగీకార ఒప్పందం కుదుర్చుకోనున్న బేవరేజెస్ కార్పొరేషన్



# బీసీ బిల్లులు ఏకగ్రీవం: సీఎం రేవంత్

### విద్య, ఉద్యోగాల్లో.. స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు కల్పించే 2 బిల్లులకు అసెంబ్లీ ఆమోదం

**బీసీలకు రిజర్వేషన్ల చట్టబద్ధత కోసం ప్రధాని మోదీని కలుద్దాం: సీఎం రేవంత్**

**ఫిబ్రవరి 4న సామాజిక న్యాయ దినోత్సవంగా పాటిద్దామని వెల్లడి**

**ఆమోదం వచ్చేలా శాస్త్రీయంగా రూపొందించాం: డిప్యూటీ సీఎం భట్టి**

హైదరాబాద్: రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెండు బిల్లులను సోమవారం శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు సంబంధించి ఒక బిల్లు, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లకు సంబంధించి మరో బిల్లు ఆమోదం పొందాయి. అనంతరం అసెంబ్లీ మంగళవారానికి వాయిదా పడింది. సోమవారం ఉదయం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.. ఈ రెండు బీసీ బిల్లులను శాసనసభలో ప్రవేశపెట్టారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి గంగుల కమలాకర్ బీసీ రిజర్వేషన్ల ఆవశ్యకతను వివరించారు. తర్వాత సాయంత్రం వరకు కూడా బీసీ రిజర్వేషన్ల బిల్లులపై శాసనసభలో సుదీర్ఘ చర్చ జరిగింది.

**ఫిబ్రవరి 4న సామాజిక న్యాయ దినోత్సవంగా జరుపుదాం**

బీసీ బిల్లులపై చర్చ అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నది కాంగ్రెస్ పార్టీ ఎజెండా. బీసీలకు 37శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును గతంలో అసెంబ్లీ ఆమోదించింది. దానికి సంబంధించిన తీర్మానం రాష్ట్రపతి వద్ద

(మిగతా 2వ పేజీలో)





## శాస్త్రీయ విధానంతోనే పునర్విభజన: భట్టి

హైదరాబాద్: లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన విషయంలో శాస్త్రీయ విధానంతో కేంద్రం ముందుకెళ్లాలని, దీనికి ఆమోదం వచ్చేంతవరకు ఆ ప్రక్రియను వాయిదా వేయాలని రాష్ట్రంలోని పలు రాజకీయ పక్షాల నేతలు అభిప్రాయపడ్డారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేయడం వల్ల దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని, ప్రధానంగా తెలంగాణకు రాజకీయ ముప్పు పొంచిఉంటుందని ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై శాస్త్రీయ విధానంతోనే కేంద్రం ముందుకెళ్లేలా ఒత్తిడి తెచ్చే కార్యాచరణను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. సోమవారం అసెంబ్లీ కమిటీ హాల్లో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కాంగ్రెస్ సీనియర్ నేత కె.జానారెడ్డి నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కాంగ్రెస్, సీపీఐ, ఎంఐఎం, సీపీఎం, సీపీఐఎంఎల్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకులు హాజరయ్యారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజన పేరుతో కేంద్రం ముందుకెళ్తున్న తీరుతో తెలంగాణకు జరిగే నష్టాన్ని ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై చర్చించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు ప్రత్యేక రాజకీయ కారణాలతో హాజరుకాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో దక్షిణాది రాష్ట్రాల పాత్ర

(మిగతా 2వ పేజీలో)



## ప్రైవేటుతో పర్యాటక శోభ..

ప్రత్యేక పర్యాటక పాలసీని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

భారీగా పెట్టుబడులు వచ్చేలా ప్రోత్సాహకాలు


రూ.15 వేల కోట్ల పెట్టుబడుల లక్ష్యం.. 3 లక్షల మందికి ప్రత్యక్ష ఉపాధి

టూరిస్టు ప్రదేశాలు భద్రమేనన్న నమ్మకం కలిగించే చర్యలు

అన్ని చోట్లా సీసీ కెమెరాలతో నిఘా.. ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా పర్యాటక రంగం ప్రైవేటు సంస్థల పెట్టుబడులతో వర్ధిల్లుతోంది. మన దేశంలోనూ ప్రధాన పర్యాటక ప్రాజెక్టులు ప్రైవేటు సంస్థల చేయూతతోనే ముందుకు సాగుతున్నాయి. దేశ విదేశీ పర్యాటకులను ఆకట్టుకునే ప్రాంతాలు తెలంగాణలో ఎన్నో ఉన్నా.. కనీస వసతులు లేక పర్యాటకులు కన్నెత్తి చూడటం లేదు. ఈ క్రమంలో రాష్ట్రంలో పర్యాటకానికి ఊపు ఇచ్చేందుకు ప్రత్యేక టూరిస్టు పాలసీని ప్రభుత్వం రూపొందించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2030 నాటి అవసరాలకు సరిపోయేలా పాలసీని రూపొందించినట్టు పేర్కొంది. ఆధ్యాత్మిక, వారసత్వ, సాంస్కృతిక,

(మిగతా 2వ పేజీలో)



## తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు శాసనసభ ఆమోదం

పరిపాలనలో గందరగోళం తొలగించేందుకే అన్న సీఎం

చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు ప్రతిపాదన

వ్యతిరేకించిన బీజేపీ..

ఓయూకు సురవరం పేరు పెట్టాలని సూచన

## మాకు చాలా విషయాలు తెలుసు... వాస్తవాలు చెబితే రేవంత్ రెడ్డికి ఇబ్బందులు తప్పవు: కేటీఆర్

**బీజేపీ నేతలతో రహస్య సమావేశాలను ఎందుకు ఖండించడం లేదని ప్రశ్న**

**రాజాసింగ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**రేవంత్ రెడ్డి బడ్జెట్ కంటే ముందే నేరాన్ని అంగీకరించి అప్రూవర్‌గా మారాడని వ్యాఖ్య**

"మాకు చాలా విషయాలు తెలుసు. మేం వాస్తవాలు చెబితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇబ్బందులు తప్పవు" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీజేపీ నేతలతో రహస్య సమావేశాలను ఆయన ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు. రహస్య భేటీలు అవాస్తవమైతే ఆ పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వానికి రూ. 70 వేల కోట్ల ఆదాయం తగ్గిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగీకరించారని వెల్లడించారు. ఇంతకంటే రాష్ట్రానికి ఘోర అవమానం మరొకటి ఉండదని ఆయన అన్నారు. రేవంత్ రెడ్డి బడ్జెట్ కంటే ముందే నేరాన్ని అంగీకరించి అప్రూవర్‌గా మారారని అన్నారు. తద్వారా రాష్ట్ర ప్రభుత్వం

(మిగతా 2వ పేజీలో)





## 19న దేవన్నపేట పంప్‌హౌస్ ప్రారంభం

ఒక మోటార్‌ను ఆన్ చేయనున్న మంత్రి ఉత్తమ్

# కొత్తగా 37 మద్యం బ్రాండ్లు

హైదరాబాద్: తెలంగాణ లిక్కర్ మార్కెట్‌లోకి అతిత్వరలో కొత్త మద్యం బ్రాండ్లు అందుబాటులోకి రానున్నాయి. ఒకటి కాదు..రెండు కాదు..ఏకంగా 37 మద్యం బ్రాండ్లు ఇందుకోసం ముందుకొచ్చాయి. మద్యం సరఫరా కోసం గతనెల 23న బేవరేజెస్ కార్పొరేషన్ కొత్త సరఫరాదారుల నుంచి దరఖాస్తులు కోరుతూ ఆసక్తి వ్యక్తీకరణ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే దేశంలో తయారయ్యే మద్యం బ్రాండ్లలో 95 శాతం కార్పొరేషన్‌తో రిజిస్టర్ అయిన నేపథ్యంలో 10లోపు బ్రాండ్లు ముందుకొస్తాయని ఎక్సైజ్ వర్గాలు భావించాయి. అయితే ఊహించని స్పందన లభించింది. గడువు ముగిసే సమయానికి ఏకంగా 37 బ్రాండ్లు దరఖాస్తు చేసుకున్నాయి. ఇందులో 15 విదేశీ మద్యం బ్రాండ్లు కాగా, మరో 15 దేశీయ మద్యం, ఏడు దరఖాస్తులు బీర్ల సరఫరాకు వచ్చినట్టు తెలుస్తోంది. నోటిఫికేషన్ లేకుండానే కొత్త బ్రాండ్ల సరఫరా కోసం అనుమతినిచ్చారంటూ వివాదాస్పద జాబితాలోకెక్కిన సోం డిస్టలరీస్ కూడా ఈ జాబితాలో ఉందని, బీర్‌తోపాటు లిక్కర్ సరఫరా కోసం ఈ సంస్థ దరఖాస్తు పెట్టిందని సమాచారం.



**ఆచితూచి.. అన్నీ సరిచూసి..**

వచ్చిన దరఖాస్తులను అన్ని కోణాల్లో పరిశీలించిన తర్వాతే మద్యం సరఫరాకు అంగీకార ఒప్పందం కుదుర్చుకుంటామని ఎక్సైజ్ వర్గాలు చెబుతున్నాయి. ఆయా సంస్థల ట్రాక్ రికార్డును పరిశీలించడంతోపాటు ఎంత ధరకు కోట్ చేసింది? ఆ బ్రాండు మద్యానికి ఇతర రాష్ట్రాలు ఎంత చెల్లిస్తున్నాయి? ఏ కేటగిరీలో ఆ బ్రాండు ఉంది? ఆ కేటగిరీకి మన రాష్ట్రంలో చెల్లిస్తున్న ధర ఎంత? ఒకవేళ సంస్థ కోట్ చేసిన ధరకు, ప్రభుత్వ ధరకు తేడా ఉంటే ఏం చేయాలి? ధరల నిర్ధారణ కమిటీకి ప్రతిపాదించాలా లేదా? అనే అంశాలను పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటారని ఆ శాఖ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. ఈ ప్రక్రియ ముగిసేందుకు కనీసం మరో నెల రోజుల సమయం పడుతుందన్నారు.

**ఆ ధర పెంచితే.. మద్యం ధర పెంపు?**

కొత్త బ్రాండ్ల సరఫరాకు ఒప్పందాలు చేసుకునే సమయంలోనే మద్యం బేసిక్ ధరలను కూడా పెంచే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది. ఇప్పటికే బీర్ల బేసిక్ ధరను పెంచిన విషయం తెలిసిందే. అయితే లిక్కర్ బేసిక్ ధరలను మాత్రం సవరించలేదు. ప్రస్తుతం లిక్కర్ కేస్ బేసిక్ ధర ఐదు స్లాబుల్లో (రూ.565, 700, 1000, 2000, 2000 కంటే ఎక్కువ చొప్పున) ఉంది. ఈ బేసిక్ ధరను కూడా కేస్‌కు రూ.85 చొప్పున పెంచే ఆలోచన ఉన్నట్టు తెలుస్తోంది. బీర్ల బేసిక్ ధర పెంచే సమయంలో బహిరంగ మార్కెట్‌లో బీర్ల ధరలను కూడా ఎక్సైజ్ శాఖ సవరించింది. అదే క్రమంలో లిక్కర్ బేసిక్ ధరలను పెంచాల్సి వస్తే మద్యం ధరలు కూడా పెరగొచ్చు. అయితే, లిక్కర్ ధరలు పెంచాలా వద్దా అన్నది రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ అంచనాలను బట్టి ఉండొచ్చు. ప్రస్తుత బడ్జెట్‌లో ఎ%వీ%్సజ్ శాఖ ద్వారా రూ.25 వేల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం అంచనా వేయగా, వచ్చే బడ్జెట్‌లో రూ.30 వేల కోట్ల వరకు వెళితే మాత్రం లిక్కర్ ధరలు పెంచక తప్పదనే అభిప్రాయం ఎ%వీ%్సజ్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.



## 19న దేవన్నపేట పంప్‌హౌస్ ప్రారంభం

### ఒక మోటార్‌ను ఆన్ చేయనున్న మంత్రి ఉత్తమ్

హైదరాబాద్: దేవాదుల ఎత్తిపోతల పథకం మూడో దశ లో భాగంగా దేవన్న పేటలో పంప్‌హౌస్ నిర్మించారు. ఆపంప్‌హౌస్‌లోని ఒక మోటార్‌ను రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఆన్ చేసి యాసంగి పంటలకు నీటిని విడుదల చేయనున్నారు. మూడు మోటార్లు పంప్‌హౌస్‌లో ఉండగా, ఒక్కో మోటార్ 600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసే సామర్థ్యాన్ని కలిగి ఉంది. దేవాదుల ప్రాజెక్టు నిర్వహణ, పర్యవేక్షణ పనులు చూసే కాంట్రాక్టర్‌కు పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో అక్కడ పనిచేసే సిబ్బంది జీతాల కోసం 24 రోజులపాటు సమ్మె నిర్వహించారు. దీంతో అప్పట్లో దేవాదుల ప్రాజెక్టు కింద రిజ ర్వాయర్లకు నీటి పంపింగ్ నిలిచిపోయింది. ప్రస్తుతం సమ్మక్కసాగర్ నుంచి దేవాదుల ప్రాజెక్టు కింద నీటిని ఎత్తిపోస్తుండగా, సమ్మక్కసాగర్‌లో 2.5 టీఎంసీల నిల్వలు మిగి లాయి. రోజూ 1,500 క్యూసెక్కుల ప్రవాహం సమ్మక్కసాగర్‌కు వస్తోంది. దేవన్నపేటలోని మూడు మోటార్లను సిద్ధం చేస్తే రోజూ 1,600 క్యూసెక్కులను ఎత్తిపోసేందుకు అవకాశం ఉంటుంది. దేవాదుల ప్రాజెక్టు కింద 5 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా, యాసంగిలో 1.9 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు.

# శాస్త్రీయ విధానంతోనే పునర్విభజన: భట్టి విక్రమార్క



హైదరాబాద్: లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన విషయంలో శాస్త్రీయ విధానంతో కేంద్రం ముందుకెళ్లాలని, దీనికి ఆమోదం వచ్చేంతవరకు ఆ ప్రక్రియను వాయిదా వేయాలని రాష్ట్రంలోని పలు రాజకీయ పక్షాల నేతలు అభిప్రాయపడ్డారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేయడం వల్ల దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని, ప్రధానంగా తెలంగాణకు రాజకీయ ముప్పు పొంచిఉంటుందని ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై శాస్త్రీయ విధానంతోనే కేంద్రం ముందుకెళ్లేలా ఒత్తిడి తెచ్చే కార్యాచరణను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. సోమవారం అసెంబ్లీ కమిటీ హాల్లో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కాంగ్రెస్ సీనియర్ నేత కె.జానారెడ్డి నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కాంగ్రెస్, సీపీఐ, ఎంఐఎం, సీపీఎం, సీపీఐఎంఎల్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకులు హాజరయ్యారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజన పేరుతో కేంద్రం ముందుకెళ్తున్న తీరుతో తెలంగాణకు జరిగే నష్టాన్ని ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై చర్చించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు ప్రత్యేక రాజకీయ కారణాలతో హాజరుకాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో దక్షిణాది రాష్ట్రాల పాత్ర అనివార్యం కావాలని, ఈ క్రమంలో రాజకీయ పార్టీలు ఇచ్చే సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుందని చెప్పారు.

**సభ తీర్మానం చేయాలి: ఎంఐఎం నేత అక్బరుద్దీన్**

జానారెడ్డి మాట్లాడుతూ.. దేశంలో కొత్త ఆందోళనకు దారితీయకుండా కొంతకాలం ఇదే సీట్ల సంఖ్యను కొనసాగించాలని, ఈ విషయంలో కేంద్రం పునరాలోచించకపోతే ప్రమాదం పొంచి ఉంటుందన్న విషయాన్ని వారికి తెలియజేయాలని సూచించారు. ఎంఐఎం శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజనను వ్యతిరేకిస్తూ శాసనసభలో తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి పంపాలని చెప్పారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సీపీఐ శాసనసభా పక్ష నేత కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఉత్తర భారతంలో పెరుగుతున్న లోక్‌సభ సీట్లకు అనుగుణంగా దక్షిణాదిలోనూ పెంచాలని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్‌తోపాటు సీపీఐ, సీపీఎం లాంటి జాతీయ పార్టీలు ఒక విధానంతో వెళ్లాలనే అభిప్రాయం సమావేశంలో వ్యక్తమైంది. ప్రతి రాష్ట్రానికి సమాన హక్కు ఉండేలా నియోజకవర్గాల పునర్విభజన జరగాలని సీపీఐఎంఎల్ నేత హనుమేశ్ అభిప్రాయపడగా, ఉత్తరాదిలో పెరుగుతున్న సీట్ల శాతం ప్రకారమే దక్షిణాదిలోనూ పెంచాలని ఆర్‌పీఐ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, సీపీఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, పల్లా వెంకట్‌రెడ్డితోపాటు పలు పార్టీల నేతలు పాల్గొన్నారు.

## ప్రైవేటుతో పర్యాటక శోభ..

సాహసక్రీడలు, మెడికల్, వెల్‌నెస్, ఎకో-టూరిజం.. ఇతివృత్తాలుగా ఆయా సెక్టార్లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పర్యాటక ప్రాజెక్టులు చేపట్టే ప్రైవేటు సంస్థలకు ప్రోత్సాహకాలివ్వాలని నిర్ణయించింది. పర్యాటకులు ముందుగా గమనించేది ఆ ప్రాంతం భద్రమేనా, కాదా అన్నది. దీని కి పాలసీలో ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. తెలంగాణ భద్రమైన ప్రాంతమన్న భావన పర్యాటకుల్లో వచ్చేలా ఆయా ప్రాంతాల్లో ఏర్పాట్లు ఉండాలని పేర్కొన్నారు. పర్యాటకులతో స్థానికులు, గైడ్లు, దుకాణదారులు ఫ్రెండ్లీగా మెలిగేలా చర్యలు తీసుకోవటంతోపాటు ఆయా ప్రాంతాలను సీసీ కెమె రాల నిఘా పరిధిలోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.

ప్రోత్సాహకాలు ఇలా..: అడ్వెంచర్ టూరిజం కేంద్రాల్లో కనీస పెట్టుబడి మొత్తం రూ.25లక్షలుగా నిర్ధారించారు. దీనికి ఈపీసీపై సబ్సిడీ మొత్తం 25శాతంగా ఖరారు చేశారు. కారవాన్ పార్క్ ప్రాజెక్టుల్లో కనీసం పెట్టుబడి రూ.25 లక్షలు, సబ్సిడీ 25 శాతం, టూర్ ఆపరేటర్ల కారవాన్‌లలో కనీస పెట్టుబడి రూ.25 లక్షలు సబ్సిడీ 25శాతం, హౌస్ బోట్ ప్రాజెక్టుల్లో కనీస పెట్టుబడి రూ.కోటి, ఈపీసీ సబ్సిడీ 25 శాతం, వే సైడ్ ఎమినిటీస్ విషయంలో కనీస పెట్టుబడి రూ.2 కోట్లు, సబ్సిడీ 10 శాతంగా ఖరారు చేశారు. వీటికితోడు నెట్ స్టేట్ జీఎస్టీని పెట్టుబడిదారులకు ప్రభుత్వం రీయింబర్స్ చేస్తుంది. స్పెషల్ టూరిజం ఏరియా (ఎస్‌టీఏ)ల విషయంలో ఆయా ప్రాజెక్టుల ఆధారంగా వయబిలిటీ గ్యాప్ ఫండ్ (బేసిక్ ఎమినిటీస్ కోసం), ఎస్‌జీఎస్టీ రీయింబర్స్‌మెంట్, భూములకు తక్కువ లీజు మొత్తం వంటి రాయితీలు కల్పిస్తారు. కొన్ని రకాల ప్రాజెక్టుల్లో ఇండస్ట్రియల్ పవర్ శ్లాబ్స్, ప్రాపర్టీ ట్యాక్సుల్లో రాయితీలుంటాయి. నిర్ధారిత ప్రాజెక్టులకు ల్యాండ్ కన్వర్షన్ చార్జీలను రీయింబర్స్ చేస్తారు.

# బీసీ బిల్లులు ఏకగ్రీవం: సీఎం రేవంత్

పెండింగ్‌లో ఉంది. సాంకేతిక కారణాల రీత్యా గతంలో చేసిన తీర్మానం ఉపసంహరించుకుని, కొత్తగా అసెంబ్లీ తీర్మానం చేసింది. బిల్లుకు మద్దతు ఇచ్చిన పక్షాలకు ధన్యవాదాలు తెలుపుతున్నాం. కేంద్రంలో అధికారంలోకి వస్తే దీన్ని అమలు చేస్తామని మా నేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. ఆ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం అడుగులు వేస్తోంది" అని పేర్కొన్నారు. రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు విశ్రమించబోనని చెప్పారు. ఫిబ్రవరి 4వ తేదీని సామాజిక న్యాయ దినోత్సవంగా జరుపుదామన్నారు.

**ఏకాభిప్రాయంతో వెళదాం.. నాయకత్వం వహిస్తా..**

బీసీల లెక్క తెలియకపోవడం వల్లే రిజర్వేషన్లపై గతంలో సుప్రీంకోర్టు అభ్యంతరం తెలిపిందని సీఎం రేవంత్ గుర్తు చేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకునే రాష్ట్రం కులగణన సర్వే చేపట్టామన్నారు. "బీసీలకు రిజర్వేషన్ కల్పించే బిల్లును చట్టం చేసేలా కేంద్రంపై అన్ని పక్షాలు ఒత్తిడి పెంచాలి. దీనిపై తెలంగాణ సమాజం ఏకాభిప్రాయంతో ఉందనే సందేశాన్ని కేంద్రానికి పంపాలి. బీసీ రిజర్వేషన్ సాధనకు నేను నాయకత్వం వహిస్తా. సభా నాయకుడిగా హామీ ఇస్తున్నా. అఖిలపక్ష నాయకులంతా సమైక్యంగా ఢిల్లీకి వెళ్లి ప్రధాన మంత్రిని కలుద్దాం. ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ తీసుకొచ్చే బాధ్యత కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ తీసుకోవాలి. మేం రాహుల్ గాంధీని కలిసి పార్లమెంట్లో ఈ అంశాన్ని ప్రస్తావించాలని కోరుతాం. ఆయనను కలిసే బాధ్యత, ఈ అంశాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించేలా చేసే బాధ్యతను పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు అప్పగిస్తాం.." అని సీఎం రేవంత్ చెప్పారు. బీసీ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందేలా చేసే బాధ్యత ప్రతి పార్టీపైనా ఉందన్నారు.

**చట్టబద్ధత లభించేలా శాస్త్రీయంగా చేశాం: భట్టి విక్రమార్క**

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుపై రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పాటు కసరత్తు చేసిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ ప్రకారం.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన సర్వే చేపట్టిందన్నారు. శాస్త్రీయంగా, పకడ్బందీగా 50రోజుల్లో దీనిని పూర్తి చేశామని చెప్పారు. "దేశంలో కులగణన శాస్త్రీయంగా జరిగిందంటే అది ఒక తెలంగాణ రాష్ట్రంలోనే.. భవిష్యత్తులో ఇతర రాష్ట్రాలు కులగణన చేయాల్సిన సమయంలో మనం చేసిన సర్వేను మోడల్‌గా తీసుకునేంత శాస్త్రీయంగా చేయించాం. గతంలో కేంద్రానికి పంపిన అనేక తీర్మానాలు శాస్త్రీయంగా లేకపోవడం వల్ల కోర్టుల్లో వీగిపోయేవి. అలాంటి అనుభవాలను దృష్టిలో పెట్టుకొని శాస్త్రీయంగా సర్వే చేయించి, అసెంబ్లీలో తీర్మానం చేశాం.." అని భట్టి వివరించారు. కుల గణనలో బీసీలు 50.36 శాతం ఉన్నట్టు తేలిందని.. దీని ఆధారంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు కోసం సభలో తీర్మానం పెట్టామన్నారు. తెలంగాణలో కులగణన జరిగినట్టే దేశవ్యాప్తంగా జరగాలని కోరుకుంటున్నట్టు తెలిపారు.

**తమిళనాడు తరహాలో రిజర్వేషన్లు సాధించుకుందాం: పొన్నం ప్రభాకర్**

తమిళనాడులో మొత్తం 68శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయని.. 50శాతం రిజర్వేషన్లు మించకూడదన్న నిబంధన కూడా ఈడబ్ల్యూఎస్‌కు 10శాతం రిజర్వేషన్లతో తొలగిపోయిందని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. తమిళనాడు స్ఫూర్తితో రిజర్వేషన్లు సాధించుకుందామన్నారు. 42శాతం బీసీ రిజర్వేషన్లకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలుపుతుందన్న నమ్మకం ఉందని తెలిపారు. బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ రాజకీయ పార్టీలన్నీ ఒకేతాటిపై ఉన్నాయన్న సంకేతం పంపిద్దామని.. ఎవరేం చేశారన్నది మరోసారి చర్చించుకుందామని చెప్పారు. బీసీ బిల్లుపై చర్చించేందుకు ప్రధాని అపాయింట్‌మెంట్ ఇప్పించే బాధ్యతను బీజేపీ నేతలు తీసుకోవాలన్నారు. బీజేపీకి ఇది శీలపరీక్ష లాంటిదని, ఆ పార్టీ వ్యాపారుల పార్టీనా, బీసీల పార్టీనా తేలిపోతుందని పేర్కొన్నారు.

**న్యాయపరమైన చిక్కులకు అవకాశం: కేపీ వివేకానంద**

కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన 42శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుకు న్యాయపరమైన చిక్కులు వచ్చే అవకాశం ఉందని బీఆర్ఎస్ సభ్యుడు కేపీ వివేకానంద పేర్కొన్నారు. బీసీ కమిషన్, డెడికేటెడ్ కమిషన్‌ల పేర్లతో శాస్త్రీయత లేకుండా బీసీ రిజర్వేషన్లను నిర్ధారిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఎవరైనా కోర్టుల్లో సవాల్ చేసే అవకాశం ఉందని.. బీజేపీ కేంద్ర మంత్రులు కూడా అదే చెప్తున్నారని తెలిపారు. ఒక పద్ధతి ప్రకారం రిజర్వేషన్ల పెంపు ప్రక్రియ జరగాల్సి ఉండగా.. అందుకు భిన్నంగా జరిపారని పేర్కొన్నారు. అయితే వివేకానంద చెప్పిన అంశాలపై మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క అభ్యంతరం తెలిపారు. కేంద్రం ఎలాంటి అడ్డంకులు లేకుండా బీసీ బిల్లును ఆమోదిస్తుందని చెప్పారు. ఇందుకోసం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధానిని కలుస్తామన్నారు. ఇక బీసీ రిజర్వేషన్ల బిల్లుపై కాంగ్రెస్ సభ్యులు బీర్ల అయిలయ్య, వాకిటి శ్రీహరి, మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ కూడా ప్రసంగించారు.

**స్వీట్లు తినిపించుకున్న మంత్రి, ఎమ్మెల్యేలు**

బీసీ బిల్లులకు శాసనసభ ఆమోదం పొందడం మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ ఎమ్మెల్యేలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మంత్రి, బీసీ ఎమ్మెల్యేలు స్వీట్లు తినిపించుకున్నారు.

## తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు

**ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు శాసనసభ ఆమోదం**

**పరిపాలనలో గందరగోళం తొలగించేందుకే అన్న సీఎం**

**చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు ప్రతిపాదన**

**వ్యతిరేకించిన బీజేపీ.. ఓయూకు సురవరం పేరు పెట్టాలని సూచన**

హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరును ప్రతిపాదిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకు సోమవారం శాసనసభ ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి పక్షాన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా సోమవారం ఈ బిల్లును ప్రవేశపెట్టారు. బిల్లు ప్రవేశపెట్టడానికి కారణాలపై సీఎం రేవంత్‌రెడ్డి సభలో ప్రకటన చేశారు. తెలుగు వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును తొలగించడాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ సహా పలువురు తీవ్రంగా వ్యతిరేకించిన నేపథ్యంలో ఆయన వివరణ ఇచ్చారు.

**పొట్టి శ్రీరాములును తక్కువగా చూడటం లేదు**

'పొట్టి శ్రీరాములు చేసిన కృషిని ఎవరూ తక్కువగా చూడటం లేదు. వారి ప్రాణ త్యాగాన్ని అందరూ స్మరించుకోవాలి. పరిపాలనలో భాగంగా కొన్ని నిర్ణయాలు తీసుకున్నాం. రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేసిన వారిని స్మరించుకుని వారి పేర్లు పెట్టుకున్నాం. రాష్ట్ర పునర్విభజన తర్వాత గత పదేళ్లుగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. అయితే కొందరు కొన్ని వర్గాల్లో అపోహలు కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. కేంద్ర పదవుల్లో ఉన్నవారు కూడా ఇలా చేయడం సమంజసం కాదు. ఉమ్మడి రాష్ట్రంలో హెల్త్ యూనివర్సిటీకి ఎన్టీఆర్ పేరుండేది. రాష్ట్ర విభజన తర్వాత ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఏపీకి వెళ్లగా తెలంగాణలో హెల్త్ యూనివర్సిటీకి కాళోజీ పేరు పెట్టుకున్నాం. ఇది ఎన్టీఆర్‌ను అగౌరవపరిచినట్టు కాదు. రాష్ట్ర విభజన తర్వాత ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీకి ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టుకున్నాం. వైఎస్ పేరుతో ఉన్న హార్టీకల్చర్ యూనివర్సిటీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టుకున్నాం. వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీకి పీవీ నరసింహారావు పేరును పెట్టుకున్నాం. ఇదే కోవలో తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు పెట్టుకున్నాం.

**వ్యక్తులను అగౌరవ పరిచేందుకు కాదు..**

ఏపీలో ఆ పాత పేర్లతో యూనివర్సిటీలు, సంస్థలు కొనసాగనున్నందున తెలంగాణలో కూడా అవే పేర్లతో ఉంటే పరిపాలనలో గందరగోళం ఏర్పడే అవకాశం ఉన్నందున మార్చుకుంటున్నాం. అంతే కానీ వ్యక్తులను అగౌరవపరిచేందుకు కాదు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు బాధ్యతాయుత పదవుల్లో ఉన్న కొందరు కులాన్ని ఆపాదిస్తున్నారు. కుల, మత ప్రాతిపదికన విభజించి రాజకీయ ప్రయోజనాలు పొందాలనుకోవటం తప్పు. గుజరాత్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరుతో ఉన్న స్టేడియంకు ఆయన పేరు తొలగించి నరేంద్ర మోదీ పేరు పెట్టారు. మేం అలాంటి తప్పిదాలు చేయలేదు..'అని రేవంత్ చెప్పారు. 'మాకు ఆర్యవైశ్యులపై, పెద్దలు పొట్టి శ్రీరాములుపై అపార గౌరవం ఉంది. ఆయన త్యాగాలు, ఆయన దేశభక్తిని సమున్నతంగా స్మరించుకునేలా.. ఇటీవలే ఘనంగా ప్రారంభించుకున్న చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు ఆయన పేరు పెట్టుకుందాం. ఈ మేరకు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు లేఖ రాస్తా. ఇక మాజీ సీఎం కె.రోశయ్య ఇంటికి చేరువలోనే ఉన్న ప్రభుత్వ నేచర్ క్యూర్ ఆసుపత్రికి రోశయ్య పేరు పెట్టడంతో పాటు ఆవరణలో ఆయన విగ్రహం కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించాం.



## మాకు చాలా విషయాలు తెలుసు... వాస్తవాలు చెబితే రేవంత్ రెడ్డికి ఇబ్బందులు తప్పవు: కేటీఆర్

పూర్తి అట్టర్ ఫ్లాప్ అని అంగీకరించినట్లేనని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం కావడానికి ముఖ్యమంత్రి అవలంబిస్తోన్న విధానాలే కారణమని ఆయన అన్నారు. కేసీఆర్ మీద ద్వేషంతో కాళేశ్వరం ప్రాజెక్టును బంద్ పెట్టి సాగును నాశనం చేశారని మండిపడ్డారు. ఫార్ములా ఈ-రేస్ వద్దని చెప్పిన ముఖ్యమంత్రి నగరంలో అందాల పోటీల నిర్వహణతో ఏం సాధిస్తారని ప్రశ్నించారు. అందాల పోటీలకు రూ. 2 వేల కోట్లు ఖర్చు చేసే బదులు మహిళలకు రూ. 2,500 చొప్పున ఇవ్వాలని సూచించారు. ఈ రేస్ వ్యవహారంలో తాను ఎలాంటి తప్పు చేయలేదని, తాము అధికారంలోకి వచ్చాక మళ్లీ కేసును విచారిస్తామని అన్నారు.



## యస్సీ వర్గీకరణ చట్టం ప్రకారమే ఉద్యోగ నియామకాలు చేపట్టాలి ఎమ్మార్పీయస్

వార్త మిర్రర్ ప్రతినిధి మార్చి 17 :ఆత్మకూర్ (యం) మండలంయస్సీ వర్గీకరణ చట్టం ప్రకారమే తెలంగాణ రాష్ట్రంలోఉద్యోగ నియమాకాలు చేపట్టాలని ఎమ్మార్పీయస్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీయస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ పిలుపుమేరకు ఆత్మకూర్ (యం ) మండలతహాసీల్దార్ కార్యాలయం వద్ద నిరసనకార్యక్రమం నిర్వహించితహసీల్దార్ కార్యాలయంలో మెమోరాండం అందజేయడం జరిగిందిఈ సందర్భంగా ఎమ్మార్పీయస్ రాష్ట్ర నాయకులు ఎమ్మెస్పి జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ మాట్లాడుతూ యస్సీ వర్గీకరణ చట్టం అమలు లేకుండా ఉద్యోగ ఫలితాలు విడుదల చేయడం ద్వారా ఎస్సి లలోని మాదిగల కు, ఉపకులాలకు తీవ్రమైన అన్యాయం జరిగుతుందని ప్రభుత్వం వర్గీకరణ చట్టం అమలులోకి తీసుకు వచ్చిన అనంతరం మాత్రమే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరడం జరిగింది. వర్గీకరణ సంపూర్ణ మైన అమలు కోసం ఎమ్మార్పీయస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ నేత్రుత్వంలో ఉద్యమాన్ని కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీయస్ రాష్ట్ర నాయకులు ఎమ్మెస్పి జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ, మండల కన్వీనర్ పందుల భిక్షపతి మాదిగ, మండల నాయకులు భూషి చంద్రయ్య మాదిగ,మామిడి అనిల్ మాదిగ,గజ్జెల్లి పవన్ మాదిగ, కానుకుంట్ల స్వామి మాదిగ, గట్టు బాబు కుమార్ మాదిగ, కదిరే శివ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



## పలు సమస్యల పై వినతి పత్రం అందజేసిన బీసీ నాయకులు

కల్వకుర్తి మార్చ్ 17 వార్త మిర్రర్ ప్రతినిధి:- బిజెపి ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డిని అసెంబ్లీలో కలిసి పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని మరియు బీసీ సంక్షేమ హాస్టల్ లో బీసీ గురుకులాలు సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ల ఫీజు రియంబర్స్మెంట్లు మెస్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని మరియు బిసి సమస్యల మీద అసెంబ్లీలో మాట్లాడాలని వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఓబీసీ మోర్చా రాజు నేత మరియు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చెరుకు మణికంఠ, బిసి విద్యార్థి సంఘం స్టేట్ కన్వీనర్ భాస్కర్ మరియు జాతీయ బీసీ సంక్షేమ సంఘం యువజన నాయకులు రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎం ఎన్ సి లో నిరుద్యోగ మహిళలకు ఉపాధి అవకాశాలు

### జాబ్ మేళా ను సద్వినియోగం చేసుకోవాలి

### ప్రతి నెల17,500 రూపాయల జీతం

### కొంగరకలాన్ ఫాక్స్ కాన్ కంపెనీలో అవకాశాలు



కీసర,వార్త మిర్రర్,మార్చ్ 17:పదవ తరగతి ఉత్తీర్ణులైన మహిళలకు మల్టీ నేషనల్ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బెలిదే రమేష్ గుప్తా తెలిపారు.కొంగరకలాన్ లో సుమారు రెండు వందల ఎకరాల విస్తీర్ణంలో ఫాక్స్ కాన్ ఎలక్ట్రానిక్ కంపెనీ ఏర్పాటు చేస్తున్నారని,తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగ మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని ఆయన వివరించారు.నిరుద్యోగ మహిళల దృష్టిలో పెట్టుకొని ఈనెల 19న బుధవారం కీసర గ్రామపంచాయతీ వద్ద గల కళ్యాణ మండపంలో మెగా జాబ్ మేళా ను నిర్వహిస్తున్నామని తెలిపారు.అర్హత ఉన్న నిరుద్యోగ యువతులు,మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఎంపికైన మహిళలకు ప్రతి నెల 17,500 జీతం ఉంటుందని అందులో సుమారు 4 వేల రూపాయలు పిఎఫ్,ఈఎస్ఐ కోసం చెల్లింపులు ఉంటాయన్నారు.కీసర నుంచి ప్రతిరోజు కంపెనీ వద్దకు ఏసీ బస్సులో రావడం పోవడంతో పాటు టీ,టిఫిన్,భోజనం వంటి సదుపాయాలు ఉంటాయని తెలిపారు.ప్రతి రోజు మూడు షిఫ్టుల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని,ఓ.టీ చేసిన వారికి రెండింతల వేతనం ఉంటుందని వివరించారు.పదవ తరగతి, ఐటిఐ,డిప్లమా పూర్తి చేసిన అభ్యర్థులు,ఇంటర్మీడియట్,డిగ్రీ ఫెయిల్ అయిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని అన్నారు.బుధవారం నిర్వహిస్తున్న జాబ్ మేళాకు విచ్చేసి నిరుద్యోగ యువతులు,మహిళలు పదవ తరగతి మెమో,ఆధార్ కార్డు,బ్యాంక్ అకౌంట్ జిరాక్స్,రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకొని ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు.




## క్యాన్సర్ ను ముందుగా గుర్తించడమే చికిత్సకు సరైన మార్గం కాంటినెంటల్ హాస్పిటల్ ఎండి డాక్టర్ గురు ఎన్ రెడ్డి

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : క్యాన్సర్ ను ముందుస్తుగా గుర్తించడమే చికిత్సకు సరైన మార్గమని కాంటినెంటల్ హాస్పిటల్ ఎండి డాక్టర్ గురు ఎన్ రెడ్డి అన్నారు. సోమవారం క్యాన్సర్ వ్యాధి నివారణ గుర్తించే మార్గాలపై ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీ తదితర అంశాలపై జరిగిన సెమినార్లో పాల్గొని ఆయన ప్రసంగించారు.గత సంవత్సరం భారతదేశంలో మొట్టమొదటిసారిగా "కాంటినెంటల్ సెంటర్ ఫర్ ఎర్లీ డిటెక్షన్ ఆఫ్ క్యాన్సర్ అండ్ ట్రీట్మెంట్" ను స్థాపించామని, ఈ సంవత్సరం రొమ్ము క్యాన్సర్లు, ఊపిరితిత్తుల క్యాన్సర్లు, ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ల ప్రారంభ క్యాన్సర్ నిర్ధారణ కోసం ఇమేజింగ్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ను" స్థాపించామని ఆయన తెలిపారు.కాంటినెంటల్ హాస్పిటల్స్లో తాజా సాంకేతికతలను కలిగి ఉన్న మా రేడియాలజిస్టులు అల్ ఇంటిగ్రేషన్ను అమలు చేయడంలో మా ఐటీ సిబ్బందితో పాటు శిక్షణ పొందారు మరియు ఇప్పటికే 1500 మందికి పైగా రోగులు క్యాన్సర్ల కోసం ఈ అల్ ఆధారిత ఇమేజింగ్ పరీక్షలను ఉపయోగించినట్లు తెలిపారు. ప్రజలు వ్యాధి వచ్చిన వెంటనే భయపడాల్సిన అవసరం లేదని సరైన ట్రీట్మెంట్ తీసుకోవడం ద్వారా ఎలాంటి వ్యాధినైనా నయం చేయొచ్చని ఆయన తెలిపారు.

# కూనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా ఫేర్ వెల్ పార్టీ

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న సామాజికవేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్





యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి గణేష్ సాగర్

భువనగిరి మండలం కూనూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫేర్ వెల్ పార్టీ ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సామాజికవేత్త, బిఆర్ఎస్ జిల్లా నాయకులు, డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ పాల్గొన్నారు వారు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యా సంవత్సరం ముగింపు సమయం వచ్చినప్పుడు ఫేర్ వెల్ పార్టీలు ఉద్వేగ భరితంగా సాగుతాయి అన్నారు. ఎందుకంటే విద్యార్థులకు ఆ విద్య సంస్థతో, టీచర్లతో, స్టాప్ తో విద్యార్థులతో ఒక అనుబంధం ఏర్పడుతుంది. అనుబంధాన్ని విడిచి బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు విద్యార్థులు ఎంతగానో బాధపడుతుంటారని అన్నారు.నేటి జ్ఞాపకాలను ఈ పాఠశాల గుర్తుంచుకోవాలంటే మీరు ఉన్నత చదువులు చదివి ఈ పాఠశాలకు నీ తల్లిదండ్రులకు గొప్ప పేరు తీసుకురావాలని అన్నారు. 10 వ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు స్టూడెంట్ మిత్ర (కెరియర్ గైడెన్స్ బుక్ లైట్) పుస్తకాలను విద్యార్థులకు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ అందజేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం సామాజికవేత్త, డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అబ్బగాని వెంకటేష్, బిఆర్ఎస్ నాయకులు నాగేంద్రబాబు, బాత్క అశోక్ యాదవ్, సంస్థ ఫౌండర్ రాము, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ పై ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు

### భగ్గుమన్న కాంగ్రెస్ శ్రేణులు .. సుధీర్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

### సుధీర్ రెడ్డి పై ఏసీపీ, సీఐలకు ఫిర్యాదు

### ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన..

### పోలీస్ స్టేషన్లో కంటనీరు పెట్టిన కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్






వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి..( సంగిశెట్టి ధనుంజయ్ నేత ) ..మార్చి : 17 ...హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ ని కించపరుస్తూ ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చేసిన అసభ్య, అనుచిత వ్యాఖ్యలపై ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసిన కార్పొరేటర్ సుజాత నాయక్. కొంత కాలంగా ఎమ్మెల్యే వేధించాడని , ఇప్పుడు మాటలతో అవమానిస్తున్నాడని పోలీస్ స్టేషన్లో కంటతడి పెట్టిన కార్పొరేటర్ సుజాత నాయక్...ఎల్బీనగర్ లోని అంబేద్కర్ జగ్జీవన్ రామ్ విగ్రహాల వద్ద సుధీర్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన కాంగ్రెస్ నాయకులు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చిత్రపటాన్ని చెప్పులతో కొడుతు .. ఆయనను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే డౌన్.. డౌన్.. అంటూ నినాదాలు చేశారు. సుధీర్ రెడ్డిపై ఎస్సీ ఎస్టీ కేసును నమోదు చేయాలని, ఎమ్మెల్యే ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.. ఈ సందర్భంగా బానోతు సుజాత నాయక్ మాట్లాడుతూ.. గిరిజన మహిళనైన నాకు ఇంత అవమానమా..? నా వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తూ, నా కుటుంబాన్ని బజార్లో పడేస్తూ సుధీర్ రెడ్డి ఇంత నీచంగా మాట్లాడతావా? నన్ను, మా కుటుంబ సభ్యులను మానసిక క్షోభకు గురి చేశాడని ఆరోపించారు. ఏం మేము రాజకీయాల్లో ఉండొద్దా? గిరిజన బిడ్డనని ఇంత అలుసుగా మాట్లాడతావా...?ఎస్సీ ఎస్టీ లు అంటే ఇంత చులకనా? సుధీర్ రెడ్డి, నీవు అహంకారం తో మాట్లాడితే మేము పడలా? మీకు భార్య, కోడళ్ళు ఉన్నారు కదా .. వారిని ఎవరైనా అంటే ఇలాగే భరిస్తావా..?ఎక్కడో మన్సూ రాబాద్ డివిజన్లో జరిగిన కార్యక్రమంలో నన్ను ఉద్దేశించి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడడం ఏమిటీ? నాకు న్యాయం జరిగేంతవరకు.. సుధీర్ రెడ్డిని వదిలిపెట్టను. ఎల్బీనగర్లో నీ ఆటలు సాగుతలేవని, ఇంత దిగజారుడు మాటలు మాట్లాడుతున్నావు. సుధీర్ రెడ్డి పై ఎస్సీ ఎస్టీ కమిషన్, పోలీసులకు ఫిర్యాదు చేశాను . చట్ట ప్రకారం రెడ్డి పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. వారు నాకు న్యాయం చేస్తారని ఆశిస్తున్నాను. నాకు జరిగిన ఈ అవమానం మరో గిరిజన మహిళకు జరగవద్దని.. ఇలా అహంకారంతో మాట్లాడే వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నాను. సుధీర్ రెడ్డి కేసు పై నమోదు చేసి అరెస్టు చేసేంతవరకు ఊరుకునేది లేదు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటు అని కార్పొరేటర్ జిహెచ్ఎంసి కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి విమర్శించారు. ఆయన ఇంట్లో కూడా ఆడవాళ్లు ఉన్నారు కదా ఇలా మాట్లాడతారా అని ప్రశ్నించారు. మనసురాబాద్ లో జరిగిన గొడవకు సుజాత నాయక్ కి ఏం సంబంధం అని ప్రశ్నించారు. తోటి కార్పొరేటర్ అయిన సుజాత నాయక్ కి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. సుధీర్ రెడ్డి పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఒకవైపు అసెంబ్లీ నడుస్తుంటే అక్కడికి వెళ్లకుండా సుధీర్ రెడ్డి రోడ్లపై చిల్లర కొట్లాటలు చేస్తున్నాడని విమర్శించారు. బీజేపీ - బీఆర్ఎస్ వాళ్ళ చిల్లర గొడవలను కాంగ్రెస్కు అంటిస్తున్నారని విమర్శించారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి , మంత్రుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. సుధీర్ రెడ్డిని అరెస్టు చేసేంతవరకు వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. మహిళా నాయకురాలు అక్కనపల్లి రాజేశ్వరి మాట్లాడుతూ.. సుధీర్ రెడ్డినీ అరెస్టు చేసేంతవరకు వదిలిపెట్టేది లేదని.. ఆయన ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు లింగాల కిషోర్ గౌడ్, చెన్నగోనీ రవీందర్ గౌడ్, కుట్ల నర్సింహా యాదవ్, డైరెక్టర్లు బుడ్డ సత్యనారాయణ, పాశం అశోక్ గౌడ్ నేలపాటి రామారావు, డీసీసీ అధికార ప్రతినిధి బొంగు వెంకటేష్ గౌడ్, మహిళా నాయకురాళ్ళు కళ్లెం సుజాత రెడ్డి, అక్కనపల్లి రాజేశ్వరి, రజినీరావు, వసంత, భాను, అనసూయ, మణి శ్రీ మమత, నాయకులు దాము మహేందర్ యాదవ్ తోకటి కిరణ్, గోపాల్ ముదిరాజ్, శ్రీనివాస్ గౌడ్, ఉమేష్ గౌడ్, గణేష్ రెడ్డి, రామకృష్ణ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, ఓరుగంటి నరేష్, రవీందర్ గౌడ్,కారుకొండ శివకుమార్, జక్కా సందీప్ , ఎస్కే మున్నా తదితరులు ఉన్నారు.



## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అల్లీపూర్ లో హాల్ టికెట్లు పంపిణీ

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) మార్చి 17

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అల్లీపూర్ నందు 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు వారి తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకున్న అనంతరం హాల్ టికెట్లు పంపిణీ చేయడం జరిగిందని ప్రధానోపాధ్యాయులు ఎం. శ్రీనివాస్ తెలిపారు. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ అనే సూక్తిని నిజం చేస్తూ తల్లి తండ్రి ఆశీర్వచనంతో ఉపాధ్యాయుల సూచన మేరకు పదవ తరగతి విద్యార్థులు ఉన్నతంగా విద్యాభ్యాసం పూర్తి చేసుకుని పదవ తరగతి పరీక్షలకు హాజరవుతూ వారు పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి అల్లిపూర్ గ్రామానికి, వారి తల్లిదండ్రులకి, పాఠశాలకి ఖ్యాతిని తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల మధ్యాహ్న భోజన కార్మికులకు, అటెండర్ కు 10వ తరగతి విద్యార్థులు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో 71 మంది విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్ గౌడ్, రవికుమార్, రాజేందర్, రతిలాల్, వసంతరావు, లక్ష్మి, రాజశేఖర్, ఆనంద్ రజిత రాజన్న బాలమురళి, మహేష్, జీవన్ రెడ్డి, శంకరయ్య, కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.



## ఎస్సి వర్గీకరణ అయ్యేవరకు గ్రూప్ 1,2,3 ఫలితాలు విడుదల చేయకూడదు

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : ఈ నెల ఆగస్టు ఒకటో తేదీనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పినట్లు ఎస్సి వర్గీకరణ బిల్లు ఆమోదం పొందే వరకు గ్రూప్ 1, 2,3 ఫలితాలు విడుదల చేయకుండా నిలుపుదల చేయాలనీ మాదిగ నాయకులు డిమాండ్ చేశారు. వర్గీకరణ చేయకుండానే ఫలితాలను విడుదల చేయడాన్ని నిరసిస్తూ సోమవారం రోజు శేరిలింగంపల్లి మండల కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్ ఆర్ పీ ఎస్ రాష్ట్ర నాయకులు గణేష్ మాదిగ మాట్లాడుతూ 35 శాతం ఉన్న మాదిగలకు 9 శాతం రిజర్వేషన్ కల్పించి, కేవలం 15 శాతం ఉన్న మాలలకు 5 శాతం రిజర్వేషన్ ఎలా కల్పిస్తారని, ఇది సబబు కాదని తెలిపారు. 35 శాతం ఉన్న మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ అవకాశం కల్పించాలని కోరుతూ, అప్పటివరకు ఈ నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి మండల అధ్యక్షులు నరేష్ మాదిగ, సుధాకర్ రాజేష్, రాజు, సతీష్ పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారానికి అంగన్వాడీల 48 గంటల సమ్మె ప్రారంభం మిర్యాలగూడ ప్రాజెక్టులో 100 మూత

మిర్యాలగూడ మార్చి 17:- (వార్తా మిర్రర్)అంగన్వాడీ

సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీలు ఈనెల 17, 18న 48 గంటల సమ్మెలో భాగంగా సోమవారం మొదటి రోజు సమ్మె 50 శాతం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయు) కార్యదర్శి బొందు పార్వతి, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతంరెడ్డి పట్టణ కార్యదర్శి తిరుపతి రామ్మూర్తిలు మాట్లాడుతూ ఐసిడిఎస్ ను నిర్వీర్యం చేసే పిఎం శ్రీ పథకాన్ని మొబైల్ అంగన్వాడి సెంటర్ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా ఆపాలని, అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రతి నెల ఒకటిన వేతనాలివ్వాలని, అంగన్వాడీలను సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పర్మినెంట్ చేయాలని, ఎన్నికలో ఇచ్చిన హామీ ప్రకారం 18 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని ఎండాకాలంలో ప్రభుత్వ పాఠశాలలకు సమానంగా వంటి పూట బడి, మే నెల అంతా ఇద్దరికీ సెలవులు ఇవ్వాలని డిమాండ్ %శ్రీ%చేశారు. మంత్రి సీతక్క హామీ ప్రకారం రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్ కు 2లక్షలు, ఆయాకు ఒక లక్ష, పెన్షన్, విఆర్ఎస్ సౌకర్యం కల్పించాలని, ఆన్లైన్ యాప్లన్నిటిని రద్దుచేసి ఒకే యాప్ ఉండే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు వీటితో పాటు అనేక సమస్యలు ఉన్నాయని వాటిని వెంటనే ప్రస్తుత జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు స్వరాజ్యం, రాదాబాయి, ప్రమీల, అరుణ, సైదమ్మ, రషీద బేగం, షాహీన్ పాల్గొన్నారు.



## భక్తి శ్రద్ధలతో శివ పార్వతుల కళ్యాణం
## శ్రీ లలితామాత ఆలయంలో ముగిసిన వేడుకలు

వార్త మిర్రర్ జగిత్యాల (తిరుమల శంకర్) మార్చి 17

జగిత్యాల రూరల్ మండలం పొలాసలోని 108 శ్రీచక్ర సహిత శ్రీ లలితామాత ఆలయంలో సోమవారం శివ పార్వతుల కల్యాణన్ని బ్రహ్మర్శి తీగుళ్ల విషు శర్మ ఘనంగా నిర్వహించారు. ఆలయ ధ్వితీయ వార్షికోత్సవ వేడుకల్లో శివ పార్వతుల కళ్యాణం భక్తి శ్రద్ధలతో వేద బ్రాహ్మనోత్తములు జరిపించగా మహిళలు, భక్తులు ఆధ్యాత్మిక వాతావరణంలో శివనామా స్మరణ చేస్తూ తిలకించారు. రెండు రోజుల పాటు జరిగిన వేడుకలు వాస్తు శాస్త్ర పండితులు శ్రీమాన్ నంబీ వేణుగోపాలా చార్య కౌశిక పర్యవేక్షణలో బ్రహ్మశ్రీ తీగుళ్ల విషు శర్మ నేతృత్వంలో, ఆలయ ఫౌండరిట్రాస్టీ చైర్మన్ చెల్లం స్వరూప సత్తయ్య, ఆలయ కమిటీ, ట్రస్టీ సభ్యుల సమక్షంలో వార్షికోత్సవ వేడుకలు ముగిషాయి. అమ్మవారిని భక్తులు, సుహాషిణిలు దర్శించుకుని భక్తి, శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. పొలాసలోని 108 శ్రీ చక్ర సహిత లలితామాత ఆలయంలో ఆలయ ఫౌండరి ట్రస్టీ చైర్మన్ చెల్లం స్వరూప సత్తయ్య ఆధ్వర్యంలో శ్రీ చక్రాలకు మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. సోమవారం దేవాలయంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనంవంటి కార్యక్రమాలు నిర్వహించిన పండితులు శివ పార్వతుల కల్యాణన్ని అత్యంత వైభవోపేతంగా జరిపించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పాలెపు అజయ్ శర్మ, దేవాలయ కమిటీ సభ్యులు, ట్రస్టీ సభ్యులు వుటూరి శ్రీనాథ్, పాంపట్టి రవీందర్, జిల్లా ప్రభాకర్, మార రాజేశం, వుటూరి కళ్యాణి, పాంపట్టి సులోచన, పెద్ది అశ్విని, అర్చన, వనజ, మహేందర్, భక్తులు, మాతలు పాల్గొన్నారు.



## ప్రేమ్ నగర్ ' ఏ ' బ్లాక్ లో ఉచిత వైద్య శిబిరం
### - ముఖ్యఅతిథిగా పాల్గొన్న షేక్ చాంద్ పాషా

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గం, కొండాపూర్ డివిజన్ పరిధిలో "నిర్మాణ్ ఆర్గనైజేషన్" సౌజన్యంతో డాక్టర్ బి రాజేష్ ఆధ్వర్యంలో ప్రేమ్ నగర్ 'ఏ' బ్లాక్ లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ చాంద్ పాషా. ఈ సందర్భంగా డాక్టర్ రాజేష్, వారి బృందం మాట్లాడుతూ కాలనీలో ఉన్న ప్రతి ఒక్కరికి బీపీ, షుగర్, థైరాయిడ్, బ్లడ్ టెస్ట్ లు చెక్ చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. చాంద్ పాషా మాట్లాడుతూ కాలనీలో ఇలాంటి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం సంతోషకరమని, ఇందులో కాలనీ ప్రజలు ప్రతి ఒక్కరు పాల్గొని వారి ఆరోగ్య సమస్యలు డాక్టర్లకు తెలిపి వారు సూచించిన మేరకు మందులు వాడాలని తెలిపారు. ఆరోగ్యం పట్ల శ్రద్ద వహిస్తూ, ఆరోగ్య నియమాలు పాటిస్తూ వ్యాయామాలు చేయాలనీ సూచించారు. క్యాంపు నిర్వహించిన డాక్టర్ రాజేష్ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సందీప్, డాక్టర్ నారాయణ, డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ గాయత్రి, డాక్టర్ పూర్ణిమ పాల్గొని వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన జలీల్, జహీర్ బృందానికి చాంద్ పాషా ప్రత్యేక అభినందనలు తెలిపారు.



## ప్రభుత్వ ఉత్తర్వులు దిక్కరిస్తున్న ప్రైవేట్ పాఠశాలలు

వార్త మిర్రర్ జగిత్యాల (తిరుమల శంకర్) మార్చి 17ప్రభుత్వ ఉత్తర్వులు దిక్కరిస్తూ సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా విద్యాధికారికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మాడవేణి సునీల్ మాట్లాడుతూ ఎండల తీవ్రత దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఒంటిపూట బడులు నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అయితే ప్రభుత్వ ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ జిల్లాలోని కొన్ని ప్రైవేటు పాఠశాలలు రెండు పూటల తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ ఉత్తర్వులు పాటించని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డీఈఓ ను కోరారు. సానుకూలంగా స్పందించిన డీఈవో నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలను గుర్తించి చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారులను ఆదేశించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి రాజు , జోనల్ ఇంచార్జ్ నిఖిల్ , రోషన్ తదితరులు పాల్గొన్నారు.



## మీర్పేట్ కార్పొరేషన్లో
## ఇంటి పన్ను తగ్గించాలని మంత్రి శ్రీధర్ బాబుకు వినతి పత్రం

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి..( సంగిశెట్టి ధనుంజయ్ నేత ) ..మార్చి : 17 ...

రాష్ట్ర ఐటీ మరియు ఇండస్ట్రీస్ , రంగారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి దూదిళ్ళ శ్రీధర్ బాబు ని కలిసిన 19వ వార్డు శ్రీ గాయత్రీ నగర్ అధ్యక్షులు జాజుల మళ్ళా రెడ్డి మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కేఎల్ఆర్ రాష్ట్ర ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ చైర్మెన్ శ్రీ చల్లా నర్సింహారెడ్డి మీర్పేట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సామిడి గోపాల్ రెడ్డి మాజీ కార్పొరేటర్ బైగళ్ల బాలమాణి ఆధ్వర్యంలో మంత్రికి మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇంటి పన్నుల విషయంలో శాస్త్రీయ పద్ధతి పాటించాలని ఇంటి పన్నులను పునర్ సమీక్ష చేసి బడుగు బలహీన వర్గాలకు మేలు చేయలని మనవి చేస్తూ విజ్ఞప్తి పత్రం ఇవ్వడం జరిగినది.

# కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

### భగత్ సింగ్ కాలనీ కమిటీ
### - అధ్యక్షులు ఎముక జంగయ్య

కల్వకుర్తి మార్చ్ 17 వార్త మిర్రర్ ప్రతినిధి:-కల్వకుర్తి పట్టణంలోని విద్యానగర్ భగత్ సింగ్ కాలనీ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని నూతన కమిటీ అధ్యక్షులు ఎముక జంగయ్య అన్నారు. సోమవారం భగత్ సింగ్ కాలనీ సమస్యల పరిష్కారానికి కాలనీవాసులు అందరు కలిసి సమావేశం నిర్వహించి,నూతన అధ్యక్షుడిని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కాలనీ అధ్యక్షుడు ఎముక జంగయ్య మాట్లాడుతూ కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటు, మిషన్ భగీరథ వాటర్,అండర్ డ్రైనేజ్,రోడ్డు,పార్కుల సుందరీకరణ తదితర సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఐక్యమత్యం, అందరి సహకారంతో కాలనీ సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధుల సహకారంతో ముందుకు సాగడంతో పాటు కాలనీ అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతామని ఆయన తెలిపారు.ప్రధాన కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి సమన్వయంతో సమిష్టిగా కృషి చేస్తే అభివృద్ధి పథంలో ముందంజలో ఉండవచ్చని, కల్వకుర్తి పట్టణానికి భగత్ సింగ్ కాలనీ నీ ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుకునేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా తోడ్పాటు అందించాలని ఆయన కోరారు. కమిటీ ఎన్నిక అనంతరం నూతనంగా ఎన్నుకోబడిన కమిటీ అధ్యక్ష కార్యదర్శులతో



పాటు కార్యవర్గ సభ్యులను శాలువాతో ఘనంగా సన్మానించారు. భగత్ సింగ్ కాలనీ నూతన కమిటీ ఎన్నికభగత్ సింగ్ కాలనీ గౌరవాధ్యక్షులుగా జయప్రసాద్, అధ్యక్షులుగా ఎముక జంగయ్య, ప్రధాన కార్యదర్శిగా గోపాల్, కోశాధికారిగా నాగభూషణ్, ఉపాధ్యక్షులుగా లింగారెడ్డి,జగదీష్, గౌరవ సలహాదారునిగా శంకర్ నాయక్, కార్యదర్శులుగా రాజు,మహేష్, చంద్రశేఖర్,అమర్నాథ్ రెడ్డి,సాయిబాబు,పరిపూర్ణాచారి, లక్ష్మారెడ్డి, సలహాదారులుగా గోపాల్ రెడ్డి, ఎపియం శ్రీనివాసులు, సుల్తాన్, ప్రచార కార్యదర్శిగా బాలయ్య, సోషల్ మీడియా ఇంచార్జ్ గా వీఐపీ శివ, లా ఆర్డర్ కార్యదర్శిగా గౌతమ్,కార్యవర్గ సభ్యులుగా జోగిరెడ్డి, వెంకట రామకృష్ణ, రాజు,బాలరాజు, చిరంజీవి, తిరుపతయ్య తధితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గ ప్రమాణస్వీకారంలో మంత్రి శ్రీధర్ బాబు

### రంగారెడ్డి జిల్లా రైతుల త్యాగమే పరిశ్రమలు రాక
### నూతన వ్యవసాయ పద్దతులను కర్షకలోకానికి పరిచయం చేయాలి
### ఒకేదఫాలో రూ.2లక్షల రుణమాఫీపై బిఆర్ఎస్ /బీజేపీ దుష్ప్రచారం
### మార్కెట్ కమిటీలో అన్ని కులాలకు ప్రాధాన్యం ఇచ్చాం: కేఎల్ఆర్

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి..( సంగిశెట్టి ధనుంజయ్ నేత ) ..మార్చి : 17 ...రైతులకు ఒకేదఫాలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి దేనని రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి, ఐటీ శాఖామంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గ ప్రమాణస్వీకారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... బీఆర్ఎస్, బీజేపీ సోషల్ మీడియా దుష్ప్రచారంపై తీవ్రంగా మండిపడ్డారు. ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తే కళ్లులేని కబోదిళ్లా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.వ్యవసాయం ఆధారిత కొత్త పరిశ్రమలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నారని మంత్రి చెప్పారు.కొత్త పరిశ్రమలకు రంగారెడ్డి జిల్లా అన్నదాతల భూముల త్యాగమే ఇక్కడి అభివృద్ధికి నిదర్శనమన్నారు. అనంతరంమహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.... వ్యవసాయ మార్కెట్ కమిటీలో అన్ని వర్గాలకు, కులాలకు ప్రాధాన్యం ఇచ్చామన్నారు.ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అధిక ప్రాధాన్యం



ఇచ్చామని కేఎల్ఆర్ చెప్పారు.రంగారెడ్డి జిల్లా రైతుల త్యాగమే నేటి యువతకు కొత్త ఉద్యోగ అవకాశాలు అన్నారు. కొత్తకమిటీ కర్షకలోకానికి మంచి చేయాలని, అవగాహన పెంచాలని రైతుబిడ్డ లక్ష్మారెడ్డి చెప్పారు. అంతకు ముందు తుక్కుగూడలో మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ కు ఘన స్వాగతం లభించింది.మహేశ్వరం పట్టణంలో స్వాగతతోరణం, కాంగ్రెస్ జెండాలు, వాహనశ్రేణితో భారీ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలోఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి టి యు ఎఫ్ ఐ డి సి కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి టిపిసిసి సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నందిగామ నరసింహ రంగారెడ్డి జిల్లా మాజీ జడ్పీ చైర్మన్, కాంగ్రెస్ నాయకురాలు, ఆర్ట్ ఫౌండేషన్ అధినేత డాక్టర్ తీగల అనిత హరినాథ్ రెడ్డి మహేశ్వరం నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు సమత తదితరులు పాల్గొన్నారులి



## అక్రమ నిర్మాణం పై చర్యలు తీసుకోవాలనీ ప్రజావాణి లో పిర్యాదు

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ :ఆదర్శనగర్, శేరిలింగంపల్లి, ప్లాట్ నెం. 53, స. నెం. 58/1 లో మిరియాల ప్రీతం నిర్మించిన అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని 'ప్రజావాణి'లో జోనల్ కమీషనర్ కు ఫిర్యాదు చేసిన 'జనం కోసం' అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కరరెడ్డి. స్టేటస్కోలో నిర్మాణం చేస్తున్న సందర్భంలో కంటెంప్ట్ కూడా ఫైల్ చేసినా బిల్డర్ బాజాప్తా నిర్మాణం చేశాడని కసిరెడ్డి భాస్కరరెడ్డి తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. సెల్లార్ తో పాటు అనేక అక్రమ ఫ్లోర్లు నిర్మించడంతో పాటు 53 గజాలు అదనంగా కబ్జా చేశాడనే విషయం టౌన్ ప్లానింగ్ దర్యాప్తులో తేలిందని వెంటనే చర్యలు తీసుకోవాలని 'జనం కోసం' డిమాండ్ చేసిందన్నారు. హోటల్ పేరు పెట్టి హోటల్ నడుపడం లేదని, కోర్టు కేసు దృష్ట్యా అలా నడుపుతున్నట్టు ఫేక్ హోటల్ సృష్టించాడని 'జనం కోసం' జోనల్ కమీషనర్ కు ఇచ్చిన ఫిర్యాదు పేర్కొన్నారు. వెంటనే ఈ అక్రమ నిర్మాణాన్ని కూల్చి వేయాలని 'జనం కోసం' జోనల్ కమీషనర్ ను డిమాండ్ చేసిందన్నారు.



## ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో
## 119 అంగన్వాడి కేంద్రాలు పని చేశాయి
### ప్రాజెక్టు ఆఫీసర్ మమత

మిర్యాలగూడ మార్చి 17:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 119 అంగన్వాడీ కేంద్రాలు పని చేశాయని, 75 కేంద్రాల్లోనే సమ్మె జరిగిందని మిర్యాలగూడ ప్రాజెక్టు ఆఫీసర్ రేఖాల మమత సోమవారం విలఖరులకు తెలిపారు. సోమవారం పట్టణంలోని పని చేస్తున్న అంగన్వాడీ కేంద్రాలను ఆమె సందర్శించి రోజు వారి కార్యక్రమం ప్రభావితం కాకుండా పర్యవేక్షించి మాట్లాడుతూ సమ్మెలో ఉన్న కేంద్రాల గురించి ఉన్నత అధికారులకు నివేదించడం జరిగిందని ఆమె తెలిపారు. సీఐటీయూ అనుబంధ యూనియన్ మాత్రమే సమ్మె పిలుపు ఇవ్వగా ఆ యూనియన్ వారే పాల్గొన్నారని, ఎఐటీయుసి, ఐఎన్టియుసి యూనియన్ వారు పాల్గొనలేదని ఆమె తెలిపారు. సమ్మె అనంతరం ఆయా కేంద్రాలకు టిహెచ్ఆర్ రూపంలో పౌష్టికాహారం ఇంటికి వెళ్లి ఇవ్వగలమని ఆమె తెలిపారు.





## లాలాపేట్ హిందు స్మశాన వాటిక
## అభివృద్ధికి డిప్యూటీ మేయర్ ప్రత్యేక చొరవ
### కాంగ్రెస్ నాయకులు ఎంఆర్.ప్రవీణ్ కుమార్

సికింద్రాబాద్, వార్తా మిర్రర్ మార్చి 17: లాలాపేట్ సాయినగర్ హిందు స్మశాన వాటిక అభివృద్ధికి నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శుభన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్త చేస్తున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎంఆర్.ప్రవీణ్ కుమార్, పలువురు స్థానికులు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం లాలాపేట్ సాయినగర్ లోని హిందుస్థశాన వాటికను కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎమ్మార్. ప్రవీన్ కుమార్, సీనియర్ నాయకులు సుధ తదితరులు డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్ రెడ్డి లను వారి నివాసంలో కలిసి కృతజ్ఞతలు చెప్పారు. స్మశాన వాటికను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న డిప్యూటీ మేయర్ దంపతులకు స్థానికులు కూడా హర్షం చేస్తున్నట్లు ప్రవీన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ వేణుతో పాటు స్థానికులు పాల్గొన్నారు.






## ప్రభుత్వ ఆసుపత్రి గోడల పై స్వచ్ఛభారత్ పెయింటింగ్

కల్వకుర్తి మార్చ్ 17 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛ భారత్ లో భాగంగా ప్రతి ఒక్కరు పాటించే విధంగా ప్రభుత్వ ఆసుపత్రి గోడల పై పెయింటింగ్ వేయించడం జరిగిందని కమిషన్ తెలియజేశారు. అదే విధంగా మిగతా ప్రభుత్వ ఆఫీస్ గోడ మీద పెయింటింగ్ తో సహా వివిధ రకాల కార్యకలాపాలలో చురుకుగా పాల్గొంటున్నట్లుగా కనిపించే విధంగా వేయించడం జరిగింది. మాత శిశు సంక్షేమం ఏ విధంగా ఉండాలి నీటి నిలువ, మొక్కల పెంపకం, పరిశుభ్రత, జంతువుల సంరక్షణ, వంటి చిత్రాలతో ఆకర్షణీయంగా గోడలను తీర్చిదిద్దడం జరిగింది. వీటి ద్వారా ప్రజలలో నూతన ఉత్సాహాన్ని కలిగించే విధంగా ఉందని పుర కమిషనర్ తెలియజేశారు.



## శ్రీపావని మల్టీ స్పెషాలిటి హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం కి విశేష స్పందన

వార్త మిర్రర్ జగిత్యాల (తిరుమల శంకర్) మార్చి 17

జగిత్యాల మండలం మోరపెల్లి గ్రామంలో శ్రీ పావని మల్టీ స్పెషాలిటి హాస్పటల్ జగిత్యాల ఆధ్వర్యంలో డా. శ్రీకాంత్ రెడ్డి ఎండీ జనరల్ మెడిసిన్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో డా.శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ గ్రామములో ఉన్న పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనే సంకల్పం తో ఈ ఉచిత వైద్యం శిబిరం నిర్వహించాము అన్నారు. ఈ కార్యక్రమం ఉచితంగా షుగర్ పరీక్ష మరియు మందులు ఇవ్వడం జరిగింది. ఈ వైద్య శిబిరం లో దాదాపు 200 మంది ఉచిత వైద్యం తీసుకోవడం జరిగింది. ఇట్టి వైద్య సేవలు అందించిన డా. శ్రీకాంత్ రెడ్డి ని జగిత్యాల ప్రాథమిక వ్యవసాయ సంఘా చైర్మన్ మహిపాల్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ లింగారెడ్డి, రాజిరెడ్డి, రాము, శేఖర్, కొక్కుల గణేష్, భూమారెడ్డి తదితరులు శాల్వతో సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో హాస్పిటల్ సిబ్బంది వోల్లాల జలంధర్, అంజలి, శ్రవణ్, నరేష్ పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## ప్రజావాణికి 4 ఫిర్యాదులు


మిర్యాలగూడ , మార్చి 17:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ సబ్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో సుమారు నాలుగు ఫిర్యాదులు వచ్చాయని సబ్ కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్ శర్మ తెలిపారు. ఎన్నికల కోడ్ అనంతరం నిర్వహించిన రెండో ప్రజావాణి సందర్భంగా తక్కువ ఫిర్యాదులు అందాయని, వచ్చిన ఫిర్యాదులను ఆయా శాఖలకు పంపించడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రజావాణిలో మిర్యాలగూడ తహసీల్దార్ ఎన్.హరిబాబు, ఎంపిడిఓ ఎం.శేషగిరిశర్మ, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ఎస్. గీతావాణి, ఐసీడీఎస్ ప్రాజెక్టుల ఆఫీసర్లు రేఖల మమత, ఎన్. చంద్రకళ, హార్టికల్చర్ ఆఫీసర్ ఎస్కె నసీమ మెహరిన్, ఎంఎఓ డి. సైదానాయక్, నీటిపారుదల, ఆర్ అండ్ బి, మిషన్ భగీరథ డిఇఇలు ఎంబి బేగ్, పాపారావు, ఎండి. అహ్మదుల్లా, ఎండి.అన్వర్, ఎఇఇ మానస, విద్యుత్ సబ్ ఇంజనీర్ జి.నవీన్, ఎంఇఓ ఎల్. బాలునాయక్, మునిసిపల్ శబాజ్ లు పాల్గొన్నారు.




## సామాజిక సేవలో బీఆర్ఎస్ నాయకులు మధుబాబు

సికింద్రాబాద్, వార్తా మిర్రర్ మార్చి 17 ...సామాజిక కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు పాలుపంచుకోవాలని ప్రముఖ సంఘసేవకులు, టెంపుల్ కమిటీ ప్రతినిధి వంజరి ముత్తయ్య, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కన్జుమర్ రైట్స్ ఆర్గనైజేషన్ గ్రేటర్ కార్యదర్శి మధుబాబు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ప్రతి సంవత్సరం మాదిరిగానే తార్నాక డివిజన్లో రద్దీగా ఉండే కూడళ్లలో చలివేంద్రాన్ని మధుబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండాకాలంలో బాటసారులు మంచినీరు లేకపోవడంతో ఎంతో ఇబ్బందులకు గురౌతుంటారని వారిని దృష్టిలో ఉంచుకొని ఇలాంటి సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీరాం శివకుమార్, టీఆర్ఎస్ నాయకులు చింతల కృష్ణ స్వామి, కృష్ణమూర్తి, శంకర్, యుగెందర్, జంపాల సత్య, కుమార్, వినోధ్ పాటు పలువురు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి ర్యాంక్ తో హెచ్ డబ్లు ఓగా ఎంపికయిన కవిత



మిర్యాలగూడ మార్చి 17:-( వార్త మిర్రర్) టీజీపీఎస్సీ సోమవారం విడుదల చేసిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్ ఒన్, టూ ఫలితాల్లో మిర్యాలగూడ మేరెడ్డి రాంచంద్రరెడ్డి స్మారక గ్రంథాలయంలో చదివిన మేఘవత్ కవిత రాష్ట స్థాయిలో 329వ ర్యాంక్ సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యారు. త్రిపురారం మండలం వస్రాంతండా పరిధిలోని నడిమి తండాకు చెందిన కవిత గత కొంత కాలంగా ఎటువంటి కోచింగ్ లేకుండా స్వతహాగా ప్రిపేరయి ఉద్యోగం సాధించారు. కవిత ఒకటవ తరగతి నుండి 10వ తరగతి వరకు గిరిజన గురుకుల పాఠశాల ఇబ్రహీంపట్నం, ఇంటర్ అరవింద కళాశాల, డిగ్రీ సమత కళాశాల, పీజీ శాంతినికేతన్ కళాశాల మిర్యాలగూడలో పూర్తి చేశారు.కవిత రాష్ట స్థాయిలో ర్యాంక్ సాధించడం పట్ల బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణా రాష్ట్ర కన్వీనర్ దశరథ్ నాయక్ హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



## రాజీవ్ స్మారక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేత

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మార్చి 17

చౌటుప్పల్ మున్సిపాలిటీ కి చెందిన ఆరెళ్ళ కృష్ణయ్య ఇటీవల కాలంలో అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబానికి,50,000/- రూపాయలను రాజీవ్ స్మారక ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ రావుల మాధవరెడ్డి సహకారంతో ట్రస్టు కార్యదర్శి ఎండి ఖయ్యూం అందజేసి వారి దాతృత్వాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి నల్ల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

### ఉపాధ్యాయులే విద్యార్థులకు మార్గదర్శకులుబీ డీఎస్పీ రాజశేఖర్ రాజు



మిర్యాలగూడ ,మార్చి 17 :-( వార్త మిర్రర్)

ప్రభుత్వ ఉన్నత పాఠశాల మిర్యాలగూడ పాఠశాల వార్షికోత్సవం,పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధీరావత్ ధర్మా నాయక్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మిర్యాలగూడ డి.ఎస్.పి రాజశేఖర్ రాజు, మండల విద్యాధికారి బాలు నాయక్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి పాఠశాల ఏఐపిసి చైర్మన్ భవాని హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట పాటలతో ఆకట్టుకున్నారు.ఈ సందర్భంగా డి.ఎస్.పి రాజశేఖర్ రాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల లో ఇంత పెద్ద కార్యక్రమము నిర్వహించడం చాలా గర్వకారణమని ప్రధానోపాధ్యా యులను, ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులే మార్గద ర్శకులు అని , విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలిగి చదువుకున్న పాఠశాలకు పేరు తీసుకురావాలని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధర్మానాయక్ మాట్లాడుతూ విద్యతో పాటు, నైతిక విలువలు, వినయ విధేయతలు కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థుల జాగ్రత్తగా చదివి ఉన్నత శిఖరాను అధిరోహించాలని అన్నారు. మండల విద్యాధికారి బాలునాయక్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు అందరూ పాసై ఉత్తీర్ణులై ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రుల ఆశయ సాధన కోసం కష్టపడాలని అన్నారు . ఈ క్రమంలో చదువు, ఆటలు, సాంస్కృతిక కళలో విద్యార్థులు సాధించిన విజయాలపై వార్షిక నివేదికను ప్రవేశపెట్టి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను, సర్టిఫికెట్స్ అందజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొర్ర కృష్ణ కాంత్ నాయక్ ఉపాధ్యాయులు ఉపేందర్, ముంతాజ్, తావుర్యా,సంతోష్, అనిత జ్యోతి, ధన లక్ష్మి, అశ్విని,స్పందన,వెంకటరమణారెడ్డి,బెబిరాణి, వినోద, కాంతయ్య, పద్మావతి, కరుణాకర్, జానయ్య, జంగయ్య,లక్ష్మయ్య, స్వామి,మీనా, భవాని, సీమా,నస్రీన్, రేణుక, పేరయ్య తదితరులు పాల్గొన్నారు

# దేవాన్ష్ చెస్ ఫాస్టెస్ట్ చెక్ మెట్ నోబెల్ బుక్ వరల్డ్ రికార్డ్స్ బ్రద్దలు కొట్టిన

### మిర్యాలగూడ బుడతడు గుండా కార్తికేయ ప్రపంచ స్థాయికి ఎదగాలి బిసి కమిషన్ సభ్యులు సురేందర్



మిర్యాలగూడ , మార్చి 17 :-( వార్త మిర్రర్) నోబెల్ వరల్డ్ అఫ్ రికార్డ్స్ ప్రతినిధుల సమక్షంలో నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం యాద్గార్ పల్లి ఎస్ఎన్డి ఫంక్షన్ హాల్ లో ఆదివారం డైమండ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చెస్ ఫాస్టెస్ట్ చెక్ మెట్ లో మిర్యాలగూడ పట్టణానికి ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు గుండా మహేష్, చంద్రకళ కుమారుడు పదేళ్ల ఐదో తరగతి విద్యార్థి గుండా కార్తికేయ వరల్డ్ అఫ్ రికార్డ్స్ ఘనత సాధించాడు. ఏర్పాటు చేసిన 180 చెస్ బోర్డులపై వేగవంతంగా పావులు కదుపుతూ 5,334 ప్రాబ్లమ్స్, కాంబినేషన్స్ అండ్ గేమ్స్ ఇన్ లాస్లో పోల్గార్ లో పజిల్స్ పరిష్కరించి ప్రపంచ రికార్డు సాధించాడు. నోబెల్ బుక్ అఫ్ రికార్డ్స్ ప్రతినిధులుగా అంతర్జాతీయ చెస్ క్రీడాకారులు ఆశ, అంకిత్ గౌడ్, అరవింద్ ల సమక్షంలో నోబెల్ బుక్ బాధ్యులు ఆన్ లైన్లో వీక్షించారు. మిర్యాలగూడ డైమండ్ చెస్ అకాడమీ నిర్వాహకులు, కోచ్ మాశెట్టి దివ్యశ్రీ కార్తికేయను తీర్చి దిద్దారు. చెస్ పట్ల కార్తికేయకున్న ఆసక్తి గమనించిన తల్లిదండ్రులు ఆన్ లైన్ లో కోచింగ్ ఇప్పించారు.గతంలో 12 నిమిషాలలో ఈ ఘనత సాధించి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మనవడు మంత్రి లోకేష్ తనయుడు నారా దేవాన్ష్ పేరిట ఉన్న రికార్డును చిన్నారి కార్తికేయ చెరిపి వేసి సరికొత్త రికార్డును నెలకొల్పాడు. ఇప్పటి వరకు ఉన్న చెస్ చెక్ మెట్ లో మిర్యాలగూడ చిన్నారి బ్రద్దలు కొట్టడం అభినందనీయమనిరాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు తిరుమలగిరి సురేందర్ అన్నారు. చెస్ లో గ్రాండ్ మాస్టర్ గా రాణించాలని ఆయన అన్నారు. చిన్న వయసులోనే అత్యంత మేధస్సుతో ఆడే చదరంగంలో ప్రపంచ రికార్డు సాధించిన కార్తికేయను ప్రత్యేకంగా అభినందించారు. ఆటలు మరింత నైపుణ్యం పొంది ప్రపంచ గ్రాండ్ మాస్టర్ కావాలని ఆకాంక్షించారు. చిన్నారిని ప్రతిభావంతుడిగా తీర్చిదిద్దిన తల్లిదండ్రులను, కోచ్ దివ్యశ్రీని ప్రత్యేకంగా అభినందించారు. చెస్ ను రాష్ట్ర ప్రభుత్వం ఆదరించేలా తన వంతు సిఫార్సు చేస్తానని ఆయన అన్నారు. రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్ మాట్లాడుతూ చిన్నారుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు అకాడమీ నెలకొల్పిన దివ్యశ్రీని, ప్రపంచ రికార్డు సాధించిన కార్తికేయను అభినందించారు. కార్తికేయను జర్నలిస్టులు ఖాజా హామీదుద్దీన్, ఎండి. అస్లాం, ఎండి. అయూబ్ అభినందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు మాశెట్టి శ్రీనివాస్, గీత, పల్లి రామచంద్రరావు, లయన్స్ క్లబ్ సభ్యులు భాస్కర్ పాల్గొన్నారు. అనంతరం డైమండ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐ బ్యాంకు ద్వారా సుమారు 420 ఐ బాల్స్ సేకరించినట్టు కర్నాటి రమేష్ కమిషన్ సభ్యులు సురేందర్ కు వివరించారు. అదేవిధంగా మీల్స్ ఆన్ వీల్స్ డైమండ్ శ్రీను నిర్వహిస్తున్నట్టు తెలపగా సురేందర్ అభినందించారు. ఐ బ్యాంకు టెక్నీషియన్ రమేష్ ను సన్మానించారు.

# మనం మనబడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు పాదపూజ

### పడమటిపల్లి జెడ్పిహెచ్ఎస్ లో పాదపూజ లో పదవ తరగతి విద్యార్థులు
### ఆధునిక రంగంలో తల్లిదండ్రులకు పాదపూజ గొప్ప కార్యక్రమం
### మనం మనబడి ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించిన తల్లిదండ్రులు ఉపాధ్యాయులు





దేవరకొండ మార్చి 17 వార్త మిర్రర్ :దేవరకొండ మండలం పడమటిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నాడు మనం మనబడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చదువు సంస్కారం తల్లిదండ్రుల పాత్ర తల్లిదండ్రులకు విద్యార్థులకు పాదపూజ కార్యక్రమాన్ని పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. చీన్యా నాయక్ డాక్టర్ మదనాచారి ముఖ్య అతిథులుగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు వారి యొక్క తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఆధునిక కాలంలో తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను పెంచి పెద్దవారిని చేసి వారి అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమిస్తూ ఉంటారని వారు అన్నారు.పెద్దవారైన తర్వాత తల్లిదండ్రులను విడిచి తల్లిదండ్రులను పట్టించుకోకుండా ఒంటరిగా వదిలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకి తల్లిదండ్రుల యొక్క శ్రమ వారి యొక్క ప్రేమానురాగాలు తెలియజేయాలన్నారు.తల్లిదండ్రులు ఎంత కష్టపడి శ్రమించి పిల్లల యొక్క అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారని అని తల్లిదండ్రుల శ్రమ అర్థం చేసుకున్న పిల్లల తల్లిదండ్రుల యొక్క పాదాలని పుష్పాలతో పూజించారు అని వారు తెలియజేశారు. తల్లి తండ్రుల కు మించిన దైవం ఈ లోకంలో లేదు, తల్లి ప్రేమ స్వచ్ఛమైనది, తల్లిఎన్నో కష్టాలను ఓర్చుకోని నవ మాసాలు మోసి బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత ఆ బాధను మర్చి పోయి బిడ్డ ముఖం చూసి తాను పడ్డ కష్టం అంతా మర్చి పోయి ఆనందం తో మురిసి పోతుంది అని తండ్రి పిల్లలను తన బుజం పై మోస్తూ, తన ఆరోగ్యం సైతం లెక్క చేయకుండా అహర్నిశలు శ్రమించి పిల్లల అభివృద్ధికి జీవితం ధార పోస్తాడు అని వారు తెలియజేశారు.తల్లి తండ్రులు దైవం కంటే ఎక్కువ, కన్పించే దైవాలు తల్లి తండ్రులే అటువంటి తల్లి తండ్రులకు పాద పూజ నిర్వహించడం పిల్లల అదృష్టం అంటూ విద్యార్థుల బాధ్యతను గుర్తు చేశారు.ఇటువంటి గొప్ప కార్యక్రమం నిర్వహించిన మనం మనబడి ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించారు.ప్రతి ఒక్కరూ కూడా మీ తల్లి తండ్రులను గౌరవించి, వారి పట్ల ఆప్యాయత అనురాగాలతో ప్రవర్తన కలిగి ఉండాలి. మొదటి బడి తల్లి ఒడి, మొదటి గురువు లు తల్లి తండ్రులు, సాక్షాత్తు కన్పించే దైవం అటువంటి వారికీ ఈ రోజే కాదు రోజు వారి పాదాలకు నమస్కారం చేసి తర్వాత మీరు మీ పనుల్లో నిమగ్నం అవ్వండి అంటూ విద్యార్థుల కు హిత బోధ చేశారు. అనంతరం పాఠశాలలో ఆయా రంగాలలో విద్యార్థులు వారి ప్రతిభను కనబరిచినందుకుగాను విద్యార్థుల తల్లిదండ్రులచే విద్యార్థులకు మెమొంటోలను అందజేశారు.ఈ కార్యక్రమంలో వారితోపాటు ఫౌండేషన్ నిర్వాహకులు పల్ల దేవేందర్ రెడ్డి శివ వెంకట్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ చిన్యా నాయక్ మనోహర్ కుమార్ వాసుదేవ్ అంజయ్య లక్ష్మీరాం పద్మా రెడ్డి ప్రతాప్ రెడ్డి సర్దార్ సింగ్ రఘువీర్ మహేశ్వరి శైలు, కరుణ సరిత శివ వెంకటేష్, విజయలక్ష్మి నారాయణ సింగ్ డాక్టర్ మదనాచారి విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# 2వ రోజు కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ నిరసన దీక్షలు

### ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ..



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మార్చి 17

సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణకు చట్టం తీసుకువస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు ఎస్సీ వర్గీకరణ ప్రకారమే చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ డిమాండ్ చేశారు.చౌటుప్పల్ మండలం కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో పోచంపల్లి బ్యాంక్ ఎదురుగా ఎమ్మార్పీఎస్ ఆద్వర్యంలో 2 రోజు నిరసన దీక్షలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బొడ్డు శ్రావణ్ కుమార్ మాదిగ మాట్లాడుతూ”ఎస్సీ వర్గీకరణ లేకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తే ఎస్సీ ఉద్యోగాలన్ని మాలలకే చెందుతాయని అన్నారు. ఎస్సీలలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు ఎస్సీ వర్గీకరణ లేకపోవడం వల్ల గత 70 ఏళ్లుగా ఉద్యోగ నియామకాల్లో తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. ఈ అన్యాయాన్ని గుర్తించే సుప్రీం కోర్టు అత్యున్నత రాజ్యాంగ ధర్మాసనం ఎస్సీ వర్గీకరణ బలపరుస్తూ చారిత్రక తీర్పును ఇచ్చిందని తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత కూడా రాష్ట్ర ప్రభుత్వం మాదిగలకు అన్యాయం చేయాలని ప్రయత్నించడం దారుణమని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎర్ర శంకర్, చింతల సాయిలు, బోయ సంజీవ, గ్యారే కృష్ణ,ఆరుట్ల లింగస్వామి, సమాచార చట్టం జిల్లా అధ్యక్షుడు దబ్బటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.